# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

సెప్టెంబర్ 2023

వెల : రూ.10.00



## శ్రీ మాతాజీ అమెరికా పర్యటనలో జులై 1 నుండి 4 వరకు డల్లాస్‌లో
## శ్రీ పి. మాధవరావు గారి గృహమున జరిగిన త్రయాహ్నిక దీక్షా దృశ్యములు





సత్సంగము



పాద పూజ



సామూహిక పూజలు

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 43 సంచిక 1

పేజీలు 44

సెప్టెంబర్ 2023

5సం॥ల చందా రూ. 500

2సం॥ల చందా రూ. 240

సంవత్సర చందా రూ. 120

విడిప్రతి వెల...... రూ. 10

**బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా**

**మేనేజరు**

**సమర్థ సద్గురు మాగజైన్**

**శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు**

**గుంటూరు జిల్లా**

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ................................ ....... **పేజీ**


దాశరథీ శతకము ................................ ..........4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట.................................... ............ 7

వేదాంత రహస్యాలు ................................ 10

జన్మ సార్థకత .... ........................ ..............12

మోక్షం .................. ...................................... 14

జీవులు - గమ్యస్థానం ................................16

నేటి జీవిత సత్యం ........................................19

అహంకారం ........... ................. .................. 21

స్వామి యుక్తేశ్వర గిరి.................. ...............25

గురువాక్య మహాత్మ్యం .................. ..............27

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు ......................29

మనశ్శతకము ..................................................30

నిరీక్షణ ..........................................................................31

త్రివిధ తపస్సులు ..........................................33

పరమ గురువు బాబూజీ మహరాజ్ ...35

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ....... ............................ ...................41

## **దాశరథీ శతకము** - భద్రాచల రామదాసు

**38)** **ఘోరకృతాంత వీరభటకోటికి గుండెదిగుల్ దరిద్రతా**
**కారపిశాచ సంహరణ కార్యవినోది వికుంఠ మందిర**
**ద్వార కవాటభేది నిజదాసజనావళికెల్లప్రొద్దు నీ**
**తారకనామమెన్న కొన దాశరథీ! కరుణాపయోనిధీ!**



భావం - నీ నామము యమభటులకు గుండె దిగులు కలిగించునది, దరిద్ర పిశాచములను నాశనము చేయునది, నీ భక్తులకెప్పటికినీ వైకుంఠ ద్వారమున గల తలుపులను బ్రద్దలుకొట్టునటు వంటిది దాశరథీ! కరుణాపయోనిధీ!

*మర్రివిత్తనం నేర్పిన పాఠం ఏమిటి?
*శ్రీబాబూజీ ఎందుకు గుప్తంగా ఉండేవారు?
*ఎంతో పుణ్యం చేసిన రామారావు ఏ స్థితిని పొందాడు?
*భక్తునికి భగవంతుని వద్ద ఎటువంటి చనువు ఉంటుంది?
*స్వతంత్ర్యరాలైన పులి బంధించబడితే పరతంత్ర్యరాలైన ఆవు ఎలా తప్పించుకోగలిగింది?
*కళ్యాణ్‌కి ఏనుగును చిత్తుచేసే బలం ఎలా వచ్చింది?
*సోక్రటీస్ చిన్నపిల్లవాడి కాళ్ళపై ఎందుకు పడ్డాడు?
*రామనామం పలుకని నోరు దేనితో సమానం?
*చెట్టు చక్రవర్తి ఎలా అయ్యింది?

***సమాధానాలు లోపలి పేజీలలో ............................***

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

1-9-1981

ఈరోజు ఉదయం శ్రీబాబూజీ వ్యాహ్యాళికి వచ్చారు. భక్తుల చరిత్రలు చదివాము. శ్రీ బాబూజీ మాట్లాడుతూ, "చూశారా! భక్తుడికి భగవానుడి దగ్గర ఎంత స్వతంత్రత, చనువు ఉంటుందో? భక్తుడు సర్వస్వతంత్రుడు. భగవానుడు భక్తునికి దాసుడు. భక్తిలో ఎంత విశిష్టత వుందో గమనించారా!



ఇక్కడ మీకొక దృష్టాంతము చెప్తాను. ఒక పాండురంగని భక్తుడు తన అస్వస్థత కారణంగా తన కుమారుని అనుదినము పండరినాధుని పూజించి నివేదన చేయమని ఆజ్ఞాపిస్తారు. తన తండ్రి ఆజ్ఞమేరకు పండరినాధుని పూజించి పిదప పాయసాన్ని నివేదన చేస్తాడు. పండరినాధుడు దానిని స్వీకరించడు. అప్పుడు ఆ భక్తుడు స్వామి నివేదన స్వీకరించే వరకు తాను అన్నం ముట్టనని ప్రతిజ్ఞ చేస్తాడు, విలపిస్తాడు, ఆవేదన చెందుతాడు. చివరకు స్వామి కనికరించి దానిని స్వీకరిస్తాడు.

ఈ విషయాన్ని తన తండ్రికి తెలియపరుస్తాడు. కాని తండ్రి ఈ విషయాన్ని, నమ్మకపోగా, తన కుమారుడే పాయసాన్ని తిని, పండరినాధుడు స్వీకరించాడని తనని నమ్మించటానికి ప్రయత్నం చేస్తున్నాడని భావిస్తాడు. ఇదే యథార్థమైతే నిరూపణ చేయమంటాడు. కాని భగవానుడు కుమారుడికి మాత్రమే దర్శనం ఇస్తాడుగాని తండ్రికి దర్శనం యివ్వడు. తన తండ్రికి దర్శనం ఇవ్వలేదని ఆ కుమారుడు భగవానుని పక్షపాతి అని దూషిస్తాడు. తన తండ్రికి దర్శనం తిరస్కరించటానికి ఆయన చేసిన అపచారం ఏమిటి? అని ప్రశ్నిస్తాడు. చివరికి పండరినాధుడు తండ్రికి కూడ సాక్షాత్కరిస్తాడు. చూశారా!

భక్తునికి భగవానునిపై ఎంత చనువు ఉంటుందో, భగవానునికి భక్తులపై ఎంత ప్రేమ ఉంటుందో" అన్నారు.

ఇంతలో హనుమాయమ్మగారు పైకి వచ్చారు. ఆవిడ వస్తూండగానే "అదుగో, ఆవిడ వస్తోంది. తొందరగా క్రిందికివెళ్ళి మీ పనులు చూసుకోండి" అన్నారు శ్రీ బాబు. హనుమాయమ్మగారు వస్తూనే అక్కడ ఉన్న భక్తులనందరిని ఉద్దేశించి, 'అందరూ క్రిందకు పదండి. అక్కడ లక్ష నామాలు చదవాలి' అని డాక్టరు రాజు చేతిలో ఉన్న భక్త విజయాలు అన్న పుస్తకాన్ని లాక్కున్నారు.

శ్రీ బాబూజీ కలుగజేసుకొని, "పదండి, పదండి ఆవిడ ఊరుకోదు" అన్నారు చిరునవ్వు చిందిస్తూ. 'వీళ్ళందరిని ఇక్కడ పెట్టుకుని కూర్చుంటే నా పని ఎలాగ? అక్కడ క్రింద నిర్వహించవలసిన లక్షనామాల పూజా కార్యక్రమం కూడా స్వామి కార్యక్రమమే కదా!' అన్నారు హనుమాయమ్మగారు.

శ్రీ బాబూజీ నవ్వుకున్నారు. కొద్ది క్షణాల క్రితమే భక్తులకు భగవంతుని పైన ఎంత స్వతంత్రత ఉంటుందో బోధ చేశారు. అది ఇప్పుడు క్రియలో నిరూపణ అయింది.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***సెప్టెంబర్ 2023 :*** AS 6751, 8869 - 8874, 9130, 9131, 9134, 9135; LM 4392

***అక్టోబర్ 2023 :*** AS 1144, 5784, 7897, 7905, 7911, 7912, 8907, 8908, 8911, 9138 - 9141, 9143, 9144, 9180; LM 4391, 4396

## అమ్మ మాట - జపమాలా ప్రసాద

### గురి తప్పని నిజ దృష్టికి గుఱుతు గురువే

**గత జన్మంబుల గొప్ప పుణ్యమెదియో గావించి నిన్ చూడగల్గితి మీ జన్మము నందు సర్వశుభముల్ సేకూరె వేయేల మా వ్రతముల్ పండె నికేమి గావలయు నీ వాత్సల్యమే మాకు సద్గతులన్ గూరిచి కర్మబంధమెడపున్ కాళీప్రసాద ప్రభూ!**

- అని పరిమి సుబ్రహ్మణ్య భాగవతార్ (కవిగారు) మనకు శ్రీకాళీప్రసాదాష్టకంలో అందించారు. అచ్చ తెలుగులోనే వున్నది కనుక, మనం ప్రతి పదార్థం చెప్పుకోనక్కరలేదు. కానీ, ఆ పద్యం కంఠస్థం చేసి నోటితో వల్లించినంత మాత్రాన సరిపోదు. దాని తాత్పర్యాన్ని చక్కగా విచారణ చేసి, నిరంతరం ఆ ఆనందానుభవంలో మునిగిన నాడు మన జన్మకు సార్థకత.



మాకు సర్వ శుభములు చేకూరాయి, మా వ్రతాలన్నీ పండి పోయాయి, ఇక సాధన ఎందుకు చేయాలి అని అనుకుంటే మాత్రం పప్పులో కాలు వేసినట్లే. శ్రీ ఆదిశంకర భగవత్పాదులవారు ఏ మూడు లభించడం అత్యంత దుర్లభం అన్నారో, అవి మూడు మనుష్యజన్మ, మోక్షం కావాలనే ఆపేక్ష, మహాపురుష సమాశ్రయం మనకి గతజన్మల పుణ్యం వలన ఈనాడు లభించాయి. లభించేశాయని సరిపెట్టుకుని చతికిలపడిపోతే మనకు లభించిన వాటిని వ్యర్థం చేసుకున్న వాళ్లమవుతాము.

'మానవజన్మ వచ్చినదెందుకు? కేవలం మూడుసార్లు తిని, ఆరుసార్లు బయటకి వెళ్ళడానికా?' అని ప్రశ్నించేవారు గురుదేవులు. అదే సంత్ కబీర్‌దాస్ **'ఖయా పీయా, సుఖ్‌సే సోయా। నాహక్ జనమ్ గవాయా॥'** అన్నారు. 84లక్షల జీవరాశుల జన్మలు ఎత్తి ఎత్తి, వాటిల్లో పడుతూ లేస్తూ, చిట్ట చివరికి నీకు ఈ సుందరమైన నరజన్మ వచ్చింది. నీకు భగవంతుడు ఇచ్చిన ముఖం (నోరు) రామభజన చేయడానికి ఇచ్చాడు. అది మరచిపోయి నువ్వు నానా వ్యర్థభాషణలు చేస్తున్నావు. కేవలం

తినడానికి, త్రాగడానికి, నిద్రపోవడానికి ఈ ఉత్తమమైన నరజన్మని వ్యర్థం చేస్తున్నాము. రామనామం నిరంతరం పలుకని నోరు (ముఖము) గోవు పృష్టం కంటే హీనమైనది. అటువంటి ముఖం వున్నా లేనట్లే. ఓ మూఢ మానవుడా! ఇప్పటికైనా నీ అజ్ఞాన నిద్రనుండి మేలుకో అని సద్గురువులు, మహాత్ములు హెచ్చరిస్తున్నారు. వారి మాటను విని నీ జన్మను సార్థకం చేసుకో. లేకపోతే నీ జన్మ వృథా! అని వారు చెప్పేది చెప్పి, వచ్చినట్లుగానే తిరిగి వెళ్ళిపోతారు.

కనుక, నీ ఆయుష్షు వుండగానే, నీవు గుర్తించవలసిన సత్యాన్ని గుర్తించు. 'సత్యం' అంటే త్రికాలాలలోనూ మారనటువంటిది. అదే **సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ.** అదే నీ స్వరూపం. మనం పుట్టక ముందు వున్నదీ, ఇప్పుడు వర్తమానంలో వున్నది, రేపు వుండబోయేది కూడా సత్యమే. అదే ఆత్మ. అదే గురువు. అదే చైతన్యం. అదే బ్రహ్మమ్. ఈ గుఱుతు తెలిపేవాడే గురువు. ఈ విషయాన్ని 'మాయ' మనకు మరుపు తెచ్చింది. కానీ, గుఱుతు తెలిపేవాడు 'గురువు' కనుక, సద్గురుదేవుల యందు నిరంతరం అఖండ, దృఢ భక్తి, విశ్వాసములు కలిగివుండి, వారు చెప్పినట్లుగా సాధన చేయాలి. అదే 'నిజదృష్టి'. అట్టి గురితప్పని నిజమైన దృష్టికి గుఱుతు గురుపాదమే. గురుదేవుడు మనలోని సత్యత్వాన్ని గుర్తించేటట్టు చేస్తాడు. కులశైలములు పెల్లగిలి మీదపడినా, జలరాశులన్నీ ఏకమై ప్రళయమే సంభవించినా, నిజమైన గురుభక్తుడు ఏమాత్రం చలించడు. గురుభక్తుడు ఏనాడూ కూడా చెప్పుడు మాటలు వినకూడదు. దానివలన అతడి మనస్సు కలుషితమై, పాడయిపోతుంది. గురుపాదమే నా సర్వస్వము. నా జీవిత నావని నడిపించే ఏడుగడ (చుక్కాని) అనే పరిపూర్ణ విశ్వాసం గురుపాదమునందు కలిగి వుండాలి. 'పులినోట్లో పడ్డవాడైనా తప్పించుకుని పోవచ్చు కానీ, గురుదృష్టిలో పడ్డవాడు మాత్రం తన గమ్యమైన మోక్షసాధాన్ని పొందకుండా ఎక్కడికీ తప్పించుకుపోలేడు. అంతేకాదు **నేను కామవరపుకోట జీడిని.** మిమ్మల్ని వదిలిపెడతానా?' అనేవారు శ్రీగురుదేవులు.

అట్టి దివ్యమైన గురుపాదం ఎక్కడుంది? అని మీరు ప్రశ్నిస్తే, 'ఎక్కడ లేదు?' అని నా జవాబు. అట్టి మహత్తరమైన గురుపాదం మనకి లభించింది. 'నీలోనే వున్న నన్ను గుర్తించు' అని గుఱుతు తెలుపుతున్నది

గురుపాదం. అన్ని దోషాలను హరింపజేసేది భగవన్నామం. జన్మాంతర వాసనలు హరించాలంటే నిరంతరం భగవన్నామ స్మరణ, తత్వ విచారణ చేసి తీరవలసినదే. పదివేల రూపాయలు వస్తున్నాయంటే పరుగెత్తుకు వెడతాడు మానవుడు. కానీ, నీకు ఎప్పటికీ తరగని పెన్నిధిని ఇస్తానని గురువులంటే వారి మాట పెడచెవిని పెడతారు మానవులు.

మనలోనే వుండి, తాను స్వయంగా ప్రకాశిస్తూ, మననీ, చరాచర సృష్టినంతటినీ ప్రకాశింపజేస్తున్న ఆ దివ్య చైతన్యాన్ని గుర్తించడమే మన జీవితలక్ష్యం. అదే దివ్యజ్ఞానం. ఇది సాధించడానికి కావలసిన అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములు, అఖండ ఆయురారోగ్య ఐశ్వర్యములు, అఖండ సుఖశాంతులను ప్రసాదించి సర్వదా గురుపాదుకలు రక్షించుగాక! జగన్మాత దయావృష్టి వర్షించుగాక!

### *పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు*

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**సెప్టెంబర్ 2023**

6 బుధ - శ్రీకృష్ణాష్టమి - శ్రీ సద్గురు పాదపూజ

9 శని - శ్రీ గురుదశమి - శ్రీసద్గురు పాదపూజ

18 సోమ - వినాయకచవితి - శ్రీసద్గురు పాదపూజ

29 శుక్ర - భాద్రపద పూర్ణిమ - శ్రీసద్గురు పాదపూజ

**అక్టోబర్ 2023**

9 సోమ - శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

15 ఆది - శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం

20 శుక్ర - మూలా నక్షత్రం, సరస్వతీ పూజ

22 ఆది - దుర్గాష్టమి - కుంకుమ పూజ

23 సోమ - మహర్నవమి - కుంకుమ పూజ

24 మంగళ - విజయదశమి - కుంకుమ పూజ

28 శని - ఆశ్వీయుజ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ. **చంద్రగ్రహణం స్పర్శకాలం రా. 1-05ని. మోక్షకాలం రా. 2-22ని. అశ్వనీ నక్షత్రం**

# వేదాంత రహస్యాలు

-ఎన్. కుట్టీ

వేదాలను శృతులు అనీ ఆమ్నాయములు (మననం చేసి తెలుసుకోదగ్గవి) అనీ అంటారు. శృతులు అంటే వినబడినవి "విద్" అంటే తెలియుట. ఈ వేదాలని తెలిసికొన్న ఋషులను "ద్రష్టలు" అంటారు. వేదంలో ఋక్కులు, యజస్సులు, సామలు అన్నీ కలిసి ఒకే ఒక వేదరాశిగా ఉండేది. వీటిని నాలుగుగా విభజించి తన శిష్యులకు అందజేసినవాడు కృష్ణద్వైపాయనుడు. వేదాలను విభజించాడు కాబట్టి ఆయనకు వేదవ్యాసుడు అని పేరు వచ్చింది.

వేదాలు 4: ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణ వేదము. ప్రతి వేదంలో నాలుగు భాగాలు ఉంటాయి: మంత్ర సంహిత, బ్రాహ్మణము, ఆరణ్యకము, ఉపనిషత్తులు.

ఈ ఉపనిషత్తులనుండి 4 మహావాక్యాలు వచ్చాయి. ఋగ్వేదమునుండి ''**ప్రజ్ఞానం బ్రహ్మ**'' (ఐతరేయోపనిషత్తు), యజుర్వేదమునుండి "**అహం బ్రహ్మాస్మి**" (బృహదారణ్యకోపనిషత్తు), సామవేదము నుండి "**తత్త్వమసి**" (ఛాందోగ్యోపనిషత్తు), అధర్వణ వేదము నుండి "**అయమాత్మా బ్రహ్మ**" (మాండూక్యోపనిషత్తు).

**ప్రజ్ఞానం బ్రహ్మ :**

ఇది బ్రహ్మము యొక్క సర్వజ్ఞతను తెలియజేస్తుంది. 84 లక్షల జీవరాశులను నడిపించేది బ్రహ్మము. సూర్య చంద్ర బ్రహ్మాదులను నడిపించే శక్తి బ్రహ్మము. సృష్టికి ముందు తరువాత ఉండేది బ్రహ్మమే.

**అహం బ్రహ్మాస్మి :**

"నేనే పరబ్రహ్మమును" అని భావించుట. మానవుడు జ్ఞానాన్ని పొంది, "నేనే ఆత్మ స్వరూపుడను" అనే సత్యాన్ని గుర్తించి ముక్తిని పొందుతాడని ఈ మహావాక్యము తెలుపుతోంది.

**తత్త్వమసి :**

చరాచరమంతా వ్యాపించి ఉన్న చైతన్యము ఎక్కడో లేదు, నీలోనే ఉండి, నీవై ఉన్నదని ఈ మహావాక్యము చెబుతోంది.

**అయమాత్మా బ్రహ్మ :**

ఆత్మయే బ్రహ్మము. జీవాత్మ పరమాత్మలు ఒకటే. ప్రణవ

సంకేతమైన ఓంకార శబ్దము మానవాళికి అందించింది. అనంత విశ్వము ఓంకారము నుండే వచ్చినదని సూచించింది.

ఈ మహావాక్యాలు బ్రహ్మను తెలిసికొనే మార్గాన్ని తెలుపుతాయి. వీటిని సమర్థులైన సద్గురువులను ఆశ్రయించి తెలుసుకోవాలి. అప్పుడే మహావాక్యాల అంతరార్థము గ్రహించగలుగుతాం. మనం ఇంతవరకు ఈ మహావాక్యాలకు అర్థాలు మాత్రమే తెలుసుకున్నాం. శాస్త్రాలు కూడా ఇంతవరకే వివరించి మూకీ భావాన్ని వహించాయి. వీటిని అనుభవంలోకి తెచ్చుకోవాలంటే సమిత్పాణియై సద్గురువులను ఆశ్రయిస్తే వారు మనకు వీటి అంతరార్థాలను తెలిపి ఆశ్రయించిన వారికి అనుభవ జ్ఞానాన్ని పొందింపజేస్తారు. అయితే వీటిని రహస్యాలు అని ఎందుకన్నారు? వేదమే బ్రహ్మను తెలిపే రహస్యము. ఆ మార్గమును వేదముల చివర ఉండే ఉపనిషత్తులు తెలియజేస్తాయి. "అది నువ్వే" "Thou art That" అనే అనుభవ జ్ఞానాన్ని కలిగిస్తాయి.

మన పూర్వజన్మ సుకృతంవల్ల మనకు సమర్థులైన గురుదేవులు లభించారు. వారి శిక్షణలో మనం సాధన చేస్తున్నాం. పట్టు వీడక సాధన చేస్తే ఈ మహావాక్యాల అనుభవాన్ని మనం తప్పక పొందగలుగుతాము!

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ నివాసులు అయిన శ్రీమతి కొండ శేషులమ్మగారు 21-8-23 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 90 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# జన్మ సార్థకత

సేకరణ - బొంబాయి కృష్ణారావు

ఒక పక్షి ఆహారం కోసం వెతుకుతుండగా దానికి ఒక మర్రిపండు కనిపించింది. మర్రిపండుని నోట కరుచుకుని ఎగురుతుండగా అది పక్షి నోటి నుండి జారిపడింది. మర్రిపండు పడిన ప్రదేశం ఒక గ్రామం ప్రక్కన ఉన్న మైదానం. మర్రిపండు మైదానంలో పడిన రోజునే బలమైన గాలులతో వర్షం కురిసింది. గాలులకు మట్టి రేగి మర్రిపండును కప్పేసింది. రెండురోజుల తరువాత మర్రిపండు విచ్చుకుని అందులో ఉన్న గింజలు బయట పడ్డాయి. మర్రిగింజలు వాటిలో అవి మాట్లాడుకున్నాయి. ఒక గింజ సంతోషంగా "మన పక్షాన అదృష్టం ఉండబట్టే మనమింకా బ్రతికి ఉన్నాము. లేదంటే పక్షి కడుపులో పడి జీర్ణం అయ్యేవారము" అంది. మరో గింజ "నిజమే, పక్షి కడుపులోకి వెళ్ళి చనిపోయేవాళ్ళం. ఇలా మాట్లాడే అవకాశమే ఉండేది కాదు" అని చెప్పింది. మిగతా గింజలు కూడా అవునవును అని సంబరపడ్డాయి.

మరో రెండు రోజులు గడిచేసరికి ఒక గింజ నుండి మొలక వచ్చింది. ఆ మొలకను చూసిన గింజ సంతోషంతో గెంతులు వేసి "మీరంతా చూడండి. నాకు మొలక వచ్చింది" అని చూపించింది. మొలకను చూసిన మిగతా గింజలు "ఆ మొలకను లాగి పడెయ్యి. మొలకెత్తావంటే నీ రూపం మారిపోతుంది. భూమిమీద కొత్తరూపంతో పెరుగుతావు. ఎదిగే క్రమంలో ఎన్నో కష్టాలు పడాలి. కొన్నిసార్లు మనుషులు మొక్కల్ని పీకి పడేస్తారు. మరికొన్నిసార్లు పశువులు తొక్కి చంపుతాయి. లేదా నమిలి మింగుతాయి. ఇవన్నీ దాటుకుని మొక్కగా పెరగాలి. ఒకవేళ ఎదిగావనుకో, కావలసినంత నీరు అందాలి. అలా నీరు దొరకకపోయినా ఎండిపోయి చస్తావు. అన్ని కష్టాలు పడలేవు కానీ మాలాగా గింజ రూపంలోనే ఉండిపో. మనమంతా హాయిగా కలసి గడుపుదాం" అన్నాయి.

మిగతా గింజల మాటలు ఆలకించింది కానీ మొలక వచ్చిన గింజ జవాబు చెప్పలేదు. తన మొలకను వేరు చేయలేదు. కొన్ని రోజులకు మర్రి మొక్క భూమి మీదకు వచ్చి ఎదగడం ప్రారంభించింది. దాని కాండం నిటారుగా ఎదిగింది. కొమ్మలు ప్రక్కలకు పెరిగాయి. ఎన్నో ఆకులు మొలిచాయి. అలా కొన్ని సంవత్సరాలు గడిచేసరికి పెద్ద వృక్షంగా ఎదిగింది.

ఎండ వేడినుండి రక్షణకోసం రైతులు, బాటసారులు మర్రిచెట్టు నీడలో విశ్రాంతి తీసుకునేవారు. పశువులు, జంతువులు రాత్రివేళల్లో, వర్షం కురిసినప్పుడు చెట్టు క్రింద తల దాచుకునేవి. పక్షులు చెట్టుమీద గూళ్ళు కట్టుకున్నాయి. మర్రిచెట్టు నిత్యం ఎందరికో ఆశ్రయం ఇస్తుండడం వలన అక్కడ సందడిగా ఉండేది.

అప్పుడప్పుడు వైద్యులు మర్రిచెట్టు దగ్గరకు వచ్చి మర్రి బెరడు, పాలు, ఆకులు, మొగ్గలు కోసుకుపోయేవారు. వాటిని వైద్యంకోసం ఉపయోగించేవారు. మైదానానికి ఆడుకోవడానికి వచ్చే పిల్లల్లో కొందరు మర్రి ఊడలతో ఊయల ఊగి ఆనందించేవారు. అవన్నీ చూసి మర్రిచెట్టు సంతోషించేది.

అలా ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి. ఒకరోజు భయంకరమైన తుపాను వచ్చింది. చాలా బలమైన గాలులు వీచాయి. ఏకధాటిగా వానలు కురిసాయి. తుపాను ధాటికి ఎన్నో వృక్షాలు నేలకొరిగాయి. అప్పుడే మర్రివృక్షం కూడా నేలకు ఒరిగింది. మర్రివృక్షం అలా ఒరిగిపోయినందుకు ప్రజలు ఎంతగానో బాధపడ్డారు. మర్రిచెట్టు కొమ్మలమీద నివసించే పక్షులు, జంతువులు మూగగా రోదించాయి. మరికొన్ని రోజులకు మర్రిచెట్టు పచ్చదనం తగ్గిపోగానే గ్రామస్తులు గొడ్డళ్లతో నరికి చెట్టు కొమ్మలను, కాండాన్ని వంట చెరుకుగా, గృహోపకరణాలుగా వాడుకున్నారు. కలప మోసుకు వెళుతున్నవారు బ్రతికినప్పుడే కాకుండా చనిపోయాక కూడా వుపయోగపడిందని చెప్పుకున్నారు.

స్వార్థంతో గింజలుగా భూమిలోనే ఉండిపోయిన మిగతా గింజలు తమ సోదరుడికి లభిస్తున్న ప్రశంసలు విని సంతోషించాయి. మరో వైపు సిగ్గుపడ్డాయి. వాటిలో ఒక గింజ 'మనమంతా దిద్దుకోలేని పొరబాటు చేశాము. ఎలా పుట్టామో అలాగే మిగిలిపోయాము. ఎవరికీ "ఉపకారం" చేయలేకపోయాము. మనల్ని గుర్తుపెట్టుకునే మంచి పని ఒక్కటి కూడా చేయలేకపోయాము. పుట్టిన ప్రతి జన్మకూ సార్థకత వుండాలి. మన జన్మ మాత్రం వృథా అయింది. పక్షి నోటినుండి జారిపడినందుకు మనం గొప్ప "అవకాశం" పొందినప్పటికీ వృథా చేసుకున్నాము. మన సోదరుడు మాత్రం మంచిపని చేశాడు. మరణించి కూడా జనం గుండెల్లో, వారి ఇళ్ళల్లో నివాసం ఏర్పరుచుకున్నాడు. జీవితమంటే మన సోదరుడిదే' అంది.

అది విన్న మరొక మర్రిగింజ 'కొందరు పిరికితనంతో బ్రతుకుతారు. ఇప్పుడు మనం చేసిన తప్పే చేస్తుంటారు. ఇతరులకు మేలుచేసే జీవితంవలన తృప్తి కలుగుతుందని తెలుసుకోలేక జీవితాన్ని వృథా చేసుకుంటారు. ప్రక్కవారికి చేసే సేవల వలన చిరస్థాయిగా పేరు నిలుస్తుందని తెలుసుకుని ఒకరికొకరు సాయపడుతూ బ్రతికితే ఎంతో బాగుంటుంది' అంది.

జరిగిపోయిన దాన్ని వెనక్కు తీసుకురాలేము కాబట్టి ఇతరులకు సహాయపడినప్పుడే ఈ జన్మకు సార్థకత...

# మోక్షం
- పాలూరి కాళీప్రసాద్

రామారావు ఊరిలో పెద్దమనిషి. గొప్ప ధర్మాత్ముడని పేరు గడించాడు. గుళ్ళూ గోపురాలూ కట్టించాడు, చెరువులు తవ్వించాడు. అయితే ఏ ధర్మకార్యం చేసినా ఆ పుణ్యం అంతా తనకే దక్కాలని, దానితో తాను మరణించిన తరువాత మోక్షాన్ని పొందాలని అభిలషించేవాడు. ఇలా ఉండగా కొంత కాలానికి రామరావుకి మరణకాలం సమీపించింది. బాధగా తనవైపు చూస్తున్న కొడుకుని పిలిచి, "ఎందుకురా బాధ పడతావు? నేను పుట్టి బుద్ధెరిగిన తరువాత ఎన్నో పుణ్యాలు చేశాను. ఒక్క పాపకార్యమూ చెయ్యలేదు. మరణించిన తరువాత నాకు ఖచ్చితంగా మోక్షం ప్రాప్తిస్తుంది. అందుకు తగిన అపరకర్మలు అన్నీ నువ్వు సవ్యంగా నిర్వర్తించు. నాకదే చాలు" అని చెప్పి కన్నుమూశాడు.

కొడుకు సుభాష్ ఆ చుట్టుప్రక్కల ప్రసిద్ధిగాంచిన పురోహితులను రప్పించి వారు చెప్పిన విధంగా అన్ని కర్మలూ శాస్త్రోక్తంగా నిర్వహించాడు. తండ్రి అస్థికలను అనేక పుణ్యనదులలో నిమజ్జనం చేశాడు. ప్రయాగ, బ్రహ్మకపాలం వెళ్ళి మరీ పిండాలు పెట్టాడు. అయినా సుభాష్ మనసులో ఏదో వెలితి. తన తండ్రి నిజంగా మోక్షాన్ని పొందాడా? ఎలాగైనా తెలుసుకోవాలి అనుకున్నాడు. అతని ఆరాటం ఫలించి ఒక మహాత్ముని దర్శనభాగ్యం కలిగింది. ఆ మహాత్ముని శ్రద్ధగా సేవించి మెల్లగా తన సందేహాన్ని తెలియజేశాడు.

ఆ మహాత్ములు చిరునవ్వు నవ్వి, "నాయనా! ఇప్పుడు మీ తండ్రి స్వర్గంలో వున్నాడు. కావాలంటే పిలిపిస్తాను నువ్వే మాట్లాడు" అని తన తపశ్శక్తితో రామారావును పిలిపించారు. అన్నాళ్ళ తరువాత తండ్రిని చూడగానే సుభాష్ ఆనందంగా "నాన్నగారూ! ఎలా ఉన్నారు? మీ చిరకాల కోరిక తీరిందా? మీకు మోక్షం ప్రాప్తించిందా" అని ఆతృతగా ప్రశ్నించాడు. అందుకు రామారావు విచారంగా, "లేదు నాయనా! నేను పొరబడ్డాను. ధర్మంగా నడుచుకోవటం, అనేక పుణ్యకార్యాలు చేయడమే మోక్షానికి మార్గమని నమ్మాను. పైగా మోక్షం అంటే అదెక్కడో వేరే లోకంలో ఉంటుందని, మరణించిన తరువాత మాత్రమే పొందగలమని నమ్మాను. నేను చేసిన పుణ్యాలరాశికి ఫలితంగా నాకు స్వర్గం ప్రాప్తించింది.

తీరా ఇక్కడకు వచ్చాక చూస్తే ఇది కూడా శాశ్వతం కాదని, కేవలం నా పుణ్యం ఖర్చు అయిపోయేదాకా మాత్రమే నన్ను ఇక్కడ వుండనిస్తారని, ఆ పుణ్యఫలం కాస్తా అనుభవించేస్తే ఇక్కడినుండి మళ్ళీ భూమిమీదకు తోసేస్తారని తెలిసింది. ఇంకా

విచిత్రమైన విషయం ఏమిటంటే ఇక్కడ ఉండే ఇంద్రాది దేవతలకు సైతం అమృతం త్రాగడం వలన మరణం అయితే లేదుగాని, వారి పదవులు, స్వర్గంలో వారి స్థానం సైతం అశాశ్వతమేనట! వారిలో వారు మాట్లాడుకుంటుండగా నేను విన్నదేమంటే జన్మరాహిత్యం పొంది మోక్షాన్ని అందుకోవాలంటే వారుసైతం భూమిపై మానవ రూపంలో జన్మించి ఆధ్యాత్మిక సాధన చేయవలసిందేనట.

పైగా మనం చేసే పుణ్యకార్యాలు అన్నీ మన పాపరాశిని తగ్గించుకోవడానికి, అలాగే లోకహితం కోసమేగానీ అవి మనకు మోక్షాన్ని ఇవ్వలేవుట. 'ఇది నేను చేస్తున్నాను, దీని ఫలితం నాకే దక్కాలి' అనే భావనలు ఉన్నంతకాలం అవి మనకు బంధాన్నే కానీ మోక్షాన్ని ఇయ్యలేవని ఇప్పుడే గ్రహించాను. అంతేకాదు నేను మరణించిన తరువాత నువ్వు చేసిన శ్రాద్ధ కర్మలన్నీ ఆయా క్షేత్రాలలోని పండాల బ్రతుకుదెరువు కోసం తప్పితే వాటివలన నాకు కలిగిన ప్రయోజనం ఏమీ లేదు" అన్నాడు.

ఇంతలో ఆ మహాత్ములు కల్పించుకొని "మోక్షం పొందాలంటే సద్గురువులను ఆశ్రయించి, వారు చూపిన మార్గంలో ఆధ్యాత్మిక సాధన చేసి, భక్తి జ్ఞాన వైరాగ్యాలను పెంపొందించుకొని, ముఖ్యంగా 'నేను, నాది' అనే అహంకార మమకారాలను వదుల్చుకొని, ఉన్నదంతా ఒకటే *అనే సత్యాన్ని గ్రహించాలి. అంతేకాదు 'నాకు మోక్షం కావాలి' అనే కోరిక కూడా బంధమే అవుతుంది. అలా జీవుని బంధించే ఈ గుణాలు, సంకల్పాలు, వాసనలనన్నింటినీ వదుల్చుకుంటే ఏ బంధన లేని ఆ స్థితే మోక్షం. అది ఎక్కడో వేరే లోకంలోనో, లేదా బయట ఎవరినుంచో పొందేది కాదు. అది నీ సహజ స్థితి. దానిని కప్పివేసిన అజ్ఞానపు పొరలు తొలగించుకుంటే మోక్షం నీ స్వరూపమే. అది బ్రతికి ఉండగానే నీ శరీరం మీద జ్వరాన్ని ఎలా అనుభవిస్తావో అలా నీ అనుభూతిలోకి వస్తుంది. అంతేగానీ చచ్చాక వచ్చేదేమీ లేదు, ఎత్తిపోతలు తప్ప" అని విశదీకరించి వారిద్దరికీ స్వాంతన కలిగించారు.*

***చచ్చాకేమొచ్చు ఎత్తిపోతలు గాక***
***బొంది జీవముండగనె మోక్షంబు***
***బొందవలయు జ్వరము మాడ్కి***
***కాళీ ప్రసాదు మాట కాంతిబాట॥***

# జీవులు - గమ్యస్థానం

- భాగవతుల హనుమత్ జయప్రద

ఒక కుక్క కాశికి వెళ్దామని బయలుదేరింది. దారి మధ్యలో ఒక ఎముక ముక్క కనబడింది. కాశికి పోయే దారి వదిలేసి ఆ ఎముక ముక్కని కొరకడం మొదలుపెట్టింది. అలాగే జీవుడు తల్లి గర్భంలో వున్నప్పుడు 'దేవుడి వద్దకు చేరాలి ఈ బాధ నేను భరించలేను' అని నిర్ణయించుకుంటాడు. 'తన లక్ష్యం అదే' అని ఎంచుకుంటాడు కానీ జన్మించిన తర్వాత భౌతిక ప్రపంచాన్ని చూస్తూ తన లక్ష్యాన్ని వదిలేస్తాడు. సుఖ దుఃఖ జనన మరణాలలోనే ఉండిపోతున్నాడు. ఇలా ఎన్నో జన్మలు అనుకుంటూనే ఉన్నాడు. జన్మించిన తర్వాత మర్చిపోతూనే ఉన్నాడు. అదృష్టవంతులు కొందరు మాత్రమే దైవాన్ని చేరుకుంటున్నారు. వారే ధన్యజీవులు!

ఒక ఆవు ఒకరోజు గడ్డి మేయడానికి అడవిలోకి వెళ్ళింది. పాపం దానికి సమయం తెలియలేదు. ఇంతలో సాయంత్రం అయ్యింది. చీకటిపడేలా ఉంది. ఇంతలో ఒక పులి తనవైపు పరిగెత్తుకుంటూ రావడం ఆ ఆవు చూసింది. పులినుంచి తప్పించుకోవడం కోసం ఆవు అటూ ఇటూ పరుగులెట్టి, పారిపోతోంది. పులికూడా అంతే వేగంగా అవుని వెంబడిస్తోంది. చివరికి ఆవుకు ఎదురుగా ఒక చెరువు కనిపించింది. పులినుంచి తప్పించుకునే కంగారులో ఆవు చెరువులోకి దూకేసింది. పులికూడా ఆవుని పట్టుకోవాలని దాని వెనుకే ఆ చెరువులోకి దూకేసింది.

దురదృష్టవశాత్తు ఆ చెరువులో నీళ్ళు చాలా తక్కువ ఉన్నాయి. ఆవు ఈదుకుంటూ ఈదుకుంటూ చెరువు మధ్యలోకి వెళ్ళిపోయింది. అక్కడ చాలా లోతైన బురద ఉంది. అందులో ఆవు పీకవరకూ కూరుకు పోయింది. ఆవుని వెంబడిస్తూ వచ్చిన ఆ పులికూడా ఆ బురదలో చిక్కుకుని పీకల్లోతులో మునిగి కేవలం తన ప్రాణాలు రక్షించుకోవడం కోసం ఆవుకి కొద్ది దూరంలో ఆగిపోయింది. ఇక అంతకుమించి ముందుకి వెళితే ఆ పులి పూర్తిగా బురదలో కూరుకుపోయి చనిపోతుంది.

ఈ స్థితిలో ఉన్న ఆ "ఆవు-పులి" రెండూ ఒకదానికి ఒకటి ఎదురు ఎదురుగా కదలలేని స్థితిలో నిలబడిపోయాయి. కొద్దిసేపయ్యాక, ఆవు పులితో ఇలా అంది, 'నీకెవరైనా యజమాని గానీ గురువు గానీ వున్నారా?' అని అడిగింది. దానికి ఆ పులి గర్వంతో ఇలా అంది, 'నేనే ఈ అడవికి రాజుని, స్వయంగా నేనే ఈ అడవి అంతటికీ యజమానిని, నాకు వేరే ఎవరు యజమాని ఉంటారు' అంది గొప్పగా. అప్పుడు ఆవు ఇలా అంది, 'నీ గొప్పదనం, నీ శక్తి ఇవేవీ కూడా ఇప్పుడు నిన్ను ఈ స్థితిలో రక్షించలేకపోయాయి కదా!' అంది.

అప్పుడు ఆ పులి, ఆవుతో ఇలా అంది, 'నీ పరిస్థితి కూడా నాలాంటిదే కదా, నువ్వు కూడా నాలాగే పీకల్లోతులో మునిగిపోయావు, చావుకు దగ్గరలో ఉన్నావు. మరి ఇప్పుడు నిన్ను ఎవరు రక్షిస్తారు.?' అంది. అప్పుడు ఆవు చిరునవ్వుతో ఇలా అంది. 'చాలా తప్పు. నాకు ఒక యజమాని ఉన్నాడు. సాయంత్రం అయ్యేసరికి నేను ఇంటికి చేరకపోతే నన్ను వెతుక్కుంటూ, ఎంత దూరమైనా వచ్చి నన్ను ఈ బురదనుంచి బయటకు లాగి క్షేమంగా ఇంటికి తీసుకెళతాడు. మరి నిన్ను ఎవరు బయటకు లాగుతారు?' అంది.

ఇలా అన్న కొద్దిసేపటికి ఆ ఆవు యొక్క యజమాని నిజంగానే వచ్చాడు. వచ్చీ రాగానే ఆ ఆవుని గట్టిగా పట్టుకుని అతి కష్టం మీద ఆ బురదగుంట నుంచి ఆ ఆవుని బయటకు లాగి, తన ఇంటికి తీసుకెళ్ళాడు. వెళ్ళేటప్పుడు ఆ ఆవు తన యజమాని కేసి ఎంతో కృతజ్ఞతా పూర్వకంగా చూసింది. కావాలంటే ఆ ఆవు, మరియు దాని యజమాని వాళ్ళిద్దరూ కలిస్తే ఆ పులిని బయటకు లాగగలరు, కానీ అది వాళ్ళ ప్రాణాలకు ముప్పు అని గ్రహించి, ఆ పులిని బురదలో వదిలేసి వెళ్ళిపోయారు.

ఈ కథలో... ఆవు - సర్వసమర్పణ చేసిన సాధకుని హృదయం. పులి- అహంకారం నిండి ఉన్న మనస్సు. యజమాని - సద్గురువు/ పరమాత్మ. బురదగుంట - ఈ సంసారం/ప్రపంచం మరియు ఆ ఆవు-పులి యొక్క సంఘర్షణ: నలుగురిలో మనం మన ఉనికిని చాటుకోవడం కోసం చేసే జీవన పోరాటం.

ఎవరిమీదా ఆధార పడకుండా జీవించడం అనేది మంచి

వుద్దేశ్యమే. కానీ 'నేనే అంతా, నా వలనే అంతా జరుగుతోంది, నేను లేకపోతే ఏమీ లేదు. నాకు ఎవరి అవసరం లేదు, రాదు' అనే భావన ఎన్నడూ మనలో కలుగరాదు. దీనినే 'అహంకారము' అంటారు. మన వినాశనానికి ఇదే బీజం అవుతుంది.

ఈ జగత్తులో 'సద్గురువు' (పరమాత్మ)ను మించిన హితాభిలాషి మన మంచిని కోరుకునేవారు వేరే ఎవరుంటారు? వుండరు. ఎందుకంటే, వారే అనేక రూపాల్లో వచ్చి, ఆయా సమయాల్లో మనల్ని నిరంతరం అనేక ఆపదలనుంచి రక్షిస్తూ ఉంటారు.

ఒకసారి నేను, మా వారు, మా అబ్బాయి జర్మనీ లో, కార్‌లో ఒక ట్రిప్ వెళ్దాం అని బయలుదేరాము. మేము ఉన్న సిటీనుండి కార్ డ్రైవ్ ఒక 8 గంటలు. బయలుదేరే ముందు వాతావరణం అంతా బాగానే ఉంది. కారు కండిషన్ కూడా బాగానే ఉంది. కొంతసేపటికి కారు హైవే మీదకి రాగానే పెద్ద తుఫాను మొదలయింది. అది చాలా స్పీడులో ఉన్న కారుని మొత్తం ఊపేసింది. కారులో ఉన్న మేము చాలా భయపడ్డాము. కాసేపు అయ్యాక తుఫాను తగ్గింది. మళ్ళీ వేరే సిటీ చేరుకోగానే మళ్ళీ మొదలు అయింది. మళ్ళీ కొంతసేపటికి మళ్ళీ తగ్గింది. అలా ఎన్నోసార్లు ఆ ప్రయాణంలో ఎన్నో ఆటంకాలు కలిగాయి. మేము ఎక్కడికి వెళ్ళినా కూడా మాతోనే శ్రీ గురుపాదుకలని, శ్రీ రాధాకృష్ణుల విగ్రహాలని మా వెంట తీసుకుని వెళ్ళడం మాకు అలవాటు. ఆ రోజు కూడా కారులో మాతోనే శ్రీ బాబు, ఇంకా శ్రీరాధాకృష్ణులు ఉన్నారు. ఆ ట్రిప్ తరువాత ఇంటికి వచ్చి కారు మెకానిక్‌కి చూపిస్తే అతను, 'ఇంత డ్యామేజ్ అయిన కారులో వరుసగా 3 రోజులు ఎలా ప్రయాణం చేశారు?' అని ఆశ్చర్యంతో అడిగాడు.

కానీ ఆ 3 రోజుల ప్రయాణంలో ఎన్నో ప్రమాదాలనుండి మమ్మల్ని బయటపడేలా చేసింది మాత్రం శ్రీగురుకృప మాత్రమే!

# నేటి జీవిత సత్యం

- వాట్సాప్ ఆర్టికల్స్ నుండి

సోక్రటీస్ జీవితంలో జరిగిన ఒక అద్భుత సంఘటన. ఒకసారి సోక్రటీస్ సముద్రతీరంలో నడుచుకుంటూ వెడుతున్నాడు. ఒడ్డున నిలబడి ఏడుస్తున్న ఒక బాలుడిని గమనించాడు. ఆ అబ్బాయి దగ్గరకు వెళ్ళి తలపై ప్రేమగా చేయివేసి, "ఎందుకు ఏడుస్తున్నావు?" అని అడిగాడు. ఆ బాలుడు, "నేను ఆ సముద్రాన్ని ఈ కప్పులో నింపాలి అనుకుంటున్నాను, కానీ అది నా కప్పులో సరిపోవట్లేదు" అన్నాడు. పిల్లవాడి మాటలు విన్న సోక్రటీస్ బిత్తరపోయి, తానే ఏడవడం మొదలుపెట్టాడు. ఇప్పుడు అడగడం పిల్లవాడి వంతు: "నువ్వు కూడా ఏడుస్తున్నావు, కానీ నీ కప్పు ఏదీ?"

సోక్రటీస్ ఇలా జవాబిచ్చాడు. "నాయనా, ఒక చిన్న కప్పులో మొత్తం సముద్రాన్ని నీవు నింపాలి అనుకుంటున్నావు, నేను నా చిన్న మనస్సులో ఈ ప్రపంచ జ్ఞానాన్ని మొత్తం నింపాలనుకుంటున్నాను. ఈ మహాసముద్రం అంతా ఈ కప్పులో సరిపోదని ఈ రోజు నీవు నాకు నేర్పించావు. నేను అనవసరంగా అశాంతికి లోనవుతున్నానని తెలుసుకున్నాను."

ఇది విన్న పిల్లవాడు ఒక క్షణం ఆగి, ఆ కప్పును సముద్రంలోకి విసిరి, "ఓ సముద్రమా, నీవు నా కప్పులో సరిపోకపోతే, నా కప్పు నీలో ఇముడుతుంది," అని అన్నాడు. వెంటనే సోక్రటీస్ పిల్లవాడి పాదాలపై పడి, "నేను ఇప్పుడు చాలా విలువైన జ్ఞానపు ముత్యాలను పొందాను, దానికి నీకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను!" అని అన్నాడు.

"ఓ మాస్టార్! మీరు నాలో పూర్తిగా లయమై ఉండలేరు, కానీ నేను మీలో పూర్తిగా లీనమై ఉండగలను" అంటూ భగవంతుడు, అస్థిరంగా సంచరిస్తున్న సోక్రటీస్‌కు ఆ పిల్లవాడిలో లయమై, సోక్రటీస్ యొక్క గర్వాన్నంతటినీ పటాపంచలు చేశాడు. గొప్ప గొప్ప చక్రవర్తుల చేత గౌరవించబడే సోక్రటీస్, ఒక చిన్నపిల్లవాడి కాళ్ళపై పడ్డాడు.

భగవంతుడు మనల్ని తన ఆశ్రయంలోకి తీసుకున్నప్పుడు, మొదట, మనలోని "నేను" అన్నది అదృశ్యమవుతుంది. మరో మాటలో

చెప్పాలంటే, మనలోని "నేను" అనేది అదృశ్యమైనప్పుడు, భగవంతుని కృప మనలోకి ప్రవహిస్తుంది. "నేను" అనేది వాస్తవానికి మన "అహం". ఇది మన చైతన్యం విస్తరించకుండా నిరోధిస్తుంది. కావున మిత్రులారా విస్తారమైన ప్రేమ సముద్రం మన హృదయంలో ఉంది. దాని తాళం కూడా మన చేతుల్లోనే ఉంది.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**సెప్టెంబర్ 2023**

6 బుధ - శ్రీకృష్ణాష్టమి - సా. 5-30 సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

9 శని - శ్రీగురుదశమి - సా. 5-30 సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

18 సోమ - వినాయకచవితి - సా. 5-30 సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

29 శుక్ర - భాద్రపద పూర్ణిమ - సా. 5-30 సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**అక్టోబర్ 2023**

9 సోమ - శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

22 ఆది - దుర్గాష్టమి - ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

23 సోమ - మహర్నవమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

24 మంగళ - విజయదశమి - ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

28 శని - ఆశ్వీయుజ పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. చంద్రగ్రహణము స్పర్శకాలం రాత్రి 1.05 గం.లు. మోక్షకాలం రాత్రి 2.22 గం.లు. అశ్వినీ నక్షత్రం, మేషరాశి


అహంకారం
ముకుంద్
__గత సంచిక తరువాయి
1


2




అదేంటి! వీళ్ళు గుహ బయటకు ఎలా వచ్చారు?!


వీళ్ళు ఇక్కడే ఉన్నారు కదా!
5


వీళ్ళు రెండు చోట్లా ఒకేసారి ఎలా ఉంటారు? ఓహో! అసలు నేను అన్నిటినీ సృష్టిస్తే స్వామి నన్ను సృష్టించారు కదా! నా అహంకారం నన్ను ఎంత మూర్ఖుడిగా చేసింది!
6


మీరు మీ తప్పుని
తెలుసుకున్నారు కదా!
అది చాలు, బ్రహ్మదేవా!
7


సృష్టిని సృష్టించిన
బ్రహ్మదేవుడికే
అహంకార గుణం వలన
ఏమయ్యిందో చూశారు
కదా! అహంకారం
మనని ఎంత చెడ్డ
పనైనా
చేయమంటుంది.
అందుకనే మన
అంతిమ శ్వాస వరకు
మనం అహంకారానికి
గురవకూడదు.
8

# స్వామి యుక్తేశ్వరగిరి

సేకరణ - మురళీ

మే పదవ తేదీ, 1855న క్రమశిక్షణ కలిగిన, నిష్కపటమైన మరియు శ్రద్ధగల భూస్వామి తండ్రి, క్షేత్రనాథ్ కరార్ మరియు భక్తురాలు, పవిత్రమైన తల్లి కాదంబినీ దేవికి పవిత్ర గంగానది ఒడ్డున ఉన్న సెరంపూర్‌లో జన్మించారు ప్రియనాథ్ కరార్. అతను తన చిన్నతనం నుండే తెలివైనవాడు, పరిశోధనాత్మకుడు, నిర్భయుడు, ధైర్యంగా, అత్యంత ఆధ్యాత్మికంగా, సహేతుకంగా మరియు తార్కికంగా ఉండేవాడు. అంతర్లీనంగా అన్వేషించడానికి అతని సహజమైన, లోతుగా పాతుకుపోయిన ధోరణి మరియు జ్ఞానంకోసం అతని అమితమైన ఆర్తి అతని పాఠశాల పరీక్షలన్నింటిలో విజయవంతంగా ఉత్తీర్ణత సాధించడానికి మరియు కళాశాల మరియు వైద్య పాఠశాలలో చేరడానికి సహాయపడింది.

తన తండ్రి మరణానంతరం, దైవచింతన కలిగిన తల్లి మార్గదర్శకత్వంలో, అతను తన తల్లి కోరిక ప్రకారం వివాహం చేసుకున్నాడు. అతను అనేక విజయాలు సాధించినప్పటికీ, అతని కుటుంబ జీవితం, అతని వైద్య పరిజ్ఞానం, ఖగోళశాస్త్రం మరియు జ్యోతిషశాస్త్రంలో అతని పాండిత్యం మరియు ఇంగ్లీష్, ఫ్రెంచ్, హిందీ, బెంగాలీ మరియు సంస్కృతంతో సహా అనేక భాషలలో అతనికి జ్ఞానం ఉన్నప్పటికీ, అతను ఇంకా ఏదో ఒక దాహంతో ఉన్నాడు. దైవసాక్షాత్కారం కోసం తీవ్రమైన కోరిక అతన్ని ఋషులు మరియు సాధువులను సందర్శించేలా చేసింది. అతను కాశీ (బెనారస్)లో శ్రీ శ్యామచరణ్ లాహిరి మహాశయుడిని కలుసుకుని, అతని శిష్యుడు అయ్యేవరకు అతని అన్వేషణకు సమాధానం లేదు. క్రియా యోగాలో తన దీక్షను ప్రారంభించిన పవిత్రమైన రోజునుండి, ప్రియనాథ్ ధ్యానం మరియు క్రియాసాధన కోసం లాహిరి మహాశయునితో సన్నిహిత ప్రత్యుత్తరాలు మరియు సహవాసంలో తనను తాను హృదయపూర్వకంగా అంకితం చేసుకున్నాడు. 1884లో స్వామి సంప్రదాయంలో చేరి శ్రీయుక్తేశ్వర్

గిరి అనే నూతన నామధేయాన్ని స్వీకరించారు. లాహిరి మహాశయుని యొక్క యోగ్యమైన శిష్యుడు, నిరంతరం భగవంతుని స్పృహలో లీనమై, శాంభవి స్థితిలో, మరియు అంతర్ముఖుడు, ప్రపంచ ప్రఖ్యాత స్వామి శ్రీయుక్తేశ్వర గిరి తప్ప మరెవరో కాదు.

మార్చి 22, 1903న వసంత విషువత్తు రోజున అతను పూరీ నీలాచలలో మరియు సముద్ర తీరానికి ఆనుకుని కరార్ ఆశ్రమం అనే పేరుతో ఒక ఆశ్రమాన్ని స్థాపించాడు. క్రియా యోగా చరిత్రలో ఇది ఒక మైలురాయి. తన గురువు యోగిరాజ్ శ్యామచరణ్ లాహిరి మహాశయునిచే హిమాలయ గుహలనుండి మైదానాలకు తీసుకు రాబడిన క్రియా యోగ అనంతమైన సముద్రంలో కలిసిపోయేలా అతని యోగ్యమైన శిష్యుడైన శ్రీయుక్తేశ్వర్‌జీ ద్వారా వ్యాపించింది. యోగ్యుడైన శిష్యుడు యోగ్యుడైన గురువు కాగలడు. అతను పరమహంస యోగానంద మరియు పరమహంస హరిహరానంద వంటి అనేక మంది యోగ్యమైన భగవంతుని-సాక్షాత్కారమైన మరియు ప్రపంచ ప్రఖ్యాతి చెందిన శిష్యులను తయారుచేశాడు, వారు ప్రపంచంలోని ప్రతి మూలమూలకు క్రియా యోగాన్ని వ్యాప్తి చేయడం ద్వారా తమ గురువు కలను విజయవంతం చేశారు.

మార్చి 9, 1936న మహాసమాధి తర్వాత ముంబై హొటల్‌లో యోగానందజీ ముందు ఆయన పునరుత్థానం గురించి, హిరణ్య లోకంలో తన నివాసాన్ని వివరిస్తూ అద్భుతమైన కథనం, మరియు పరమహంస హరిహరానంద మరియు ఇతర శిష్యుల ముందు చాలాసార్లు కనిపించడం, భక్తులను ఆధ్యాత్మిక ప్రకంపనలతో నింపుతుంది. అతని ఐదు ముఖ్యమైన సూక్ష్మ నైపుణ్యాలు - స్వీయ-నియంత్రణ, ఆధ్యాత్మిక సాధనలో స్థిరత్వం, లోతైన లేఖనాల అంతర్దృష్టి, స్వీయ-శరణాగతి మరియు కఠినమైన క్రమశిక్షణ - అంతిమంగా అధిరోహించాలనుకునే క్రియా అభ్యాసకులకు అమూల్యమైన సంపదగా మిగిలిపోయింది.

# గురువాక్య మహాత్మ్యం

ఒకానొకప్పుడు ఒక గురువుగారు, ఆయన శిష్యుడు నదినుండి వారి ఆశ్రమానికి తిరిగి వెళ్తున్నారు. ఇంతలో హఠాత్తుగా గురువుగారు ఒక మహావృక్షం ముందు ఆగి ప్రసన్నంగా నవ్వుతూ "తథాస్తు" అన్నారు. గురువుగారి చర్యకి కారణం ఏంటి? అని అడిగాడు శిష్యుడు.

"ఆ మహావృక్షం తన కోరికని పక్కనున్న మరో వృక్షంతో చెప్తుంటే నాకు వినబడి 'తథాస్తు' అన్నాను." "ఏమిటా కోరిక గురువు గారూ?" "తాను చక్రవర్తి అయి భూమండలాన్ని ఏలాలని." "వచ్చే జన్మలోనా?" "కాదు ఈ జన్మలోనే." శిష్యుడు పగలబడి నవ్వాడు, "గురువు గారూ, ఇది మరీ గొంతెమ్మ కోరిక కదూ! అంత అత్యాశ తగునా? అర్హత చూసుకోవాల్సిన పనిలేదా?"

"అర్హతకేం నాయనా! జీవితమంతా ప్రతిఫలాపేక్ష లేకుండా ఫలాలనిచ్చింది. ఎన్నో జీవరాశులకి ఆశ్రయం ఇచ్చింది. అదంతా పుణ్యమే కదా!" "అవుననుకోండి. కానీ చెట్టు చక్రవర్తి ఎలా అవుతుంది" అన్నాడు శిష్యుడు. అది విని "ఏమో, భగవానుడు సంకల్పిస్తే ఏమైనా కావచ్చు!" అన్నారు గురువుగారు. ఆ రాత్రి పెద్ద గాలివాన వచ్చి ఆ మహావృక్షం నేలకూలింది.

శిష్యుడు నవ్వుకున్నాడు. అంతటితో ఆ విషయం మరిచి పోయాడు. సరిగ్గా సంవత్సరం తరువాత ఒక్కరోజు ఆ శిష్యుడు పరుగు పరుగున వస్తూ "గురువు గారూ, ఈ వింత విన్నారా! శ్రీరామచంద్రుల వారి పాదుకలకి పట్టాభిషేకం చేశారు వారి సోదరులు భరతులవారు. ఇకనుండీ పధ్నాలుగేళ్ళు పాదుకలు సామ్రాజ్యాన్ని పరిపాలిస్తాయట!" అన్నాడు.

దానికి గురువుగారు నవ్వి, "చెట్టు చక్రవర్తి ఎలా అవుతుంది అన్నావు. ఇప్పుడు అయింది కదా!" అన్నారు. "అంటే?" అడిగాడు శిష్యుడు. "అవున్నాయనా, ఆ మహావృక్షం కలపతోనే వడ్రంగులు పాదుకలు చేశారు. అవి శ్రీరామచంద్రుల వారికి సమర్పించారు. ఎన్ని జన్మలు ఎంత తపస్సు చేసిందో, ఎన్ని పుణ్యాలు చేసుకుందో, ఆ మహావృక్షం పాదరక్షలుగా మారి శ్రీరామచంద్రులవారి పాదాల వద్దకు చేరింది.

శ్రీరామచంద్రులవారు ఆ పాదుకల్ని భరతుల వారికివ్వడం, భరతులవారు పాదుకలకి పట్టాభిషేకం చేయడం అంతా ఒక్కరోజులో జరిగిపోయింది. ఆ విధంగా చక్రవర్తి కావాలన్న ఆ మహా వృక్షం కోరిక నెరవేరింది." అని చెప్పిన గురువుగారికి సాష్టాంగ ప్రణామం చేశాడు ఆ శిష్యుడు. సద్గురువు వాక్కు సత్యం అయ్యి తీరుతుంది. కాదు కాదు, ఆ భగవంతుడే మహాత్ముల నోటినుంచి వచ్చిన మాటలు నిజమయ్యేలాగా సంకల్పిస్తాడు.

## శ్రీమాతాజీవారి సత్సంగ కార్యక్రమాలు

శ్రీకాళీవనాశ్రమము, హైదరాబాద్‌శాఖలో
29-9-23 సోమవారం నుండి 1-10-23 ఆదివారం వరకు
పూజ్యశ్రీ యోగిని శ్రీచంద్ర కాళీప్రసాద మాతాజీవారిచే సత్సంగ కార్యక్రమాలు జరుగును.

ఇ.నెం. 10-4-503/ఎ, శ్రీరామ్ నగర్ కాలనీ, సరోజనీదేవి నేత్ర వైద్యశాల వెనుక, మెహిదీపట్నం, హైదరాబాద్ - 500028

వివరములకు - 9177034123, 9948397063, 9885555109, 9849968539, 9701877436

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**సెప్టెంబరు 2023**

5 మంగళ - ఉపాధ్యాయ దినోత్సవం

6 బుధ - శ్రీ కృష్ణాష్టమి - కలశస్థాపన, శ్రీ రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన. రాత్రి 7.00 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ

7 గురు - శ్రీ కృష్ణాష్టమి - ఉ.11.00 గం.లకు సామూహిక శ్రీ రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన

8 శుక్ర - శ్రీ కృష్ణాష్టమి సత్సంగం

9 శని - శ్రీగురుదశమి - ఏకాహం, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

13 బుధ - మాసశివరాత్రి

14 గురు - అమావాస్య

18 సోమ - వినాయకచవితి - తె.జా. 5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ. ఉ.11.00 గం.లకు సామూహిక వినాయకచవితి పూజలు, భక్తసమారాధన

29 శుక్ర - భాద్రపద పూర్ణిమ, ఆశ్రమ ట్రస్ట్ హాస్పిటల్ వార్షికోత్సవం - శ్రీ సద్గురు పాదపూజ

**అక్టోబరు 2023**

9 సోమ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

13 శుక్ర - మాసశివరాత్రి

14 శని - అమావాస్య

15 ఆది - శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం - ఉ. 8.28- గం.లకు అంకురార్పణ

20 శుక్ర - మూలా నక్షత్రం, సరస్వతీ పూజ - సామూహిక కుంకుమ పూజలు

22 ఆది - దుర్గాష్టమి

23 సోమ - మహర్నవమి

24 మంగళ - విజయదశమి - సామూహిక కుంకుమ పూజలు

25 బుధ - ఏకాదశి - ఏకాహం, దీక్షావిరమణ, శ్రీ సద్గురు పాదపూజ

28 శని - ఆశ్వీయుజ పూర్ణిమ, శ్రీ మాతాజీవారి జన్మదిన మహోత్సవం - శ్రీ సద్గురు మండల దీక్ష ప్రారంభం. శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన. చంద్రగ్రహణము స్పర్శకాలం రాత్రి 1.05 గం.లు. మోక్షకాలం రాత్రి 2.22 గం.లు. అశ్వినీ నక్షత్రం, మేషరాశి

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి

(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

**21. దేహం బెట్లాత్మని సందేహింపక ధృఢము సేయు ధీరులు ప్రకృతి**
**గ్రాహగ్రస్తులనుచు వైదేహీ ప్రభు నాత్మగాగ దెలియుము మనసా.**

తాత్పర్యము: భౌతికమే నిత్యమని తలచు వారు, అస్థిరమైన దేహము ఆత్మ ఎలా అవుతుందని వాదిస్తారు. వారిని విస్మరించి వైదేహీ పతిని ఆత్మగా తెలియుము మనసా.

**22. మును ప్రాణ మాత్మగా గను, జనులవివేకులని తెలిసి సంతతము ధరా**
**తనయాధిపుని దలంపుము, గనుగొని ప్రాణాతిరిక్తుగా నొగి మనసా.**

తాత్పర్యము: కొందరు దేహము ఆత్మ అని, మరికొందరు ప్రాణములే ఆత్మ అని అవివేకముతో వాదిస్తారు. ప్రాణముల కంటే ఉన్నతమైన భూమిసుధాపుని (శ్రీరాముని) స్థిరముగా నిలుపుము మనసా.

**23. నిను నాత్మగా దలంచుచు, ననిశము వాదించువారి నతి మూర్ఖులగా**
**గని సర్వ నియామకు రాముని నంతట జూడు భక్తిమునుకొన మనసా.**

తాత్పర్యము: ఆత్మ అంటే నువ్వే అని మూర్ఖంగా వాదించు వారిని వదలి సకల చరాచరము నందు నిండి యుండి సర్వ నియామకుడైన రాముని భక్తి గొలువుము మనసా.

**24. అలబుద్ధి యాత్మయనుచుం, బలుమఱు వాదించు వారు పామరులు సుమీ**
**తలపగ బ్రజ్ఞాతీతుం, డల భద్రాచల నివాసుడమలుడు మనసా.**

తాత్పర్యము: ఆత్మ అనగా బుద్ధి అని వాదించే పామరుల మాట వినక, భద్రాచలాధీశుడు, అమలుడు, ప్రజ్ఞలకు అతీతుడు అయిన రాముని కొలువుము మనసా.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

ఇసుమంతనైననూ మార్పులేని ప్రశాంత వదనముతో, "తండ్రిగారి మాటను మించిన మంత్రములేదు" యని బదులిచ్చి, చినతల్లికి ప్రణమిల్లి, రాముడు వెనుదిరిగాడు. విషయమును తెలుసుకొనిన సహోదరుడు లక్ష్మణుడు కోపగ్రస్తుడై, విల్లంబులను కైపట్టి, "అన్నకు కలిగిన ఈ సంభవమునకు కారణమైన దశరథ, కైకేయిలపై పగ తీర్చుకొనవలయును" యని సంకల్పించి, వింటికి నారిని సంధించి ఢంకారం చేసాడు. ఆ శబ్దమును వినిన సీతాపతియైన రాముడు అచ్చోటకు వచ్చి తమ్ముని ఈ విధంగా సమాధాన పరచాడు.

**తవ లక్ష్మణ జానామి మయి స్నేహమనుత్తమం।**
**విక్రమం చైవ సత్యం చ తేజశ్చ సుదురాసదం॥**
**ధర్మః హి పరమః లోకే ధర్మే సత్యం ప్రతిష్ఠితం।**
**ధర్మ సంక్షితం ఏతచ్చ పితుర వచనం ఉత్తమం॥**
**సో అహం న శాక్ష్యామి పితుర నియోగం అతివర్తితుం।**
**పితుర హి వచనాత్ వీర కైకేయా అహం ప్రచోదితః॥**

"ఓ లక్ష్మణా! నీకు నా యెడలగల ప్రేమ, నీ ధీరత్వం, నీయొక్క పరాక్రమం, దివ్యతేజస్సు మున్నగువానినన్నింటినీ నేనెరుగుదును. ధర్మమునకు కట్టుబడియుండుటయే ఈ విశ్వమందు వున్నతమైన గుణము. ధర్మముననుసరించియే సత్యము స్థాపించబడును. తండ్రిగారి శ్రేష్టమైన ఈ మాటలు ధర్మముతో ముడిపడి ఉన్నాయి. నేను తండ్రిగారి ఆజ్ఞను ఎన్నటికీ ఉల్లంఘించలేను. ఆయన ఇచ్చిన వరముల మేరకే కైకేయి వనవాసమునకు నన్ను ప్రేరేపించింది", అన్నాడు రాముడు తమ్ముడు లక్ష్మణునితో.

లక్ష్మణుడు ఇక్కడ ఉంటే గనుక భరతునికి ఆపదయని తలచి, ఆతనిని కూడా తనతో రమ్మని చెప్పాడు. ఇదిలా జరుగుచుండగా, సుమంత్రుడు, వశిష్టులిరువురూ కైకేయికి ఆమె కోరిన వరముల వలన ఆమెకు పలు విధములుగ కలుగు దుష్టభావములను గూర్చి వివరించ యత్నించిననూ, ఆమె ఏ మాత్రమూ చలించలేదు. తీవ్ర కోపమునకు గురైన దశరథుడు కైకేయిని అనేక విధములుగ నిందించి, తనను

కౌసల్య మందిరమునకు తీసుకొని వెళ్ళమని అనుచరులను కోరాడు.

రాముడు తనకు సెలవిప్పించమని కోరుటకై సీతవద్దకు వెడల, ఆమె తన భర్తయైన ఆతనితో అడవులకు వెళ్ళుటయే తన ధర్మమని, రాముడు ఎంత వారించిననూ, మొండిగా ఆతనితో కూడి వనవాసము జేయ ఆతనిని అనుసరించింది.

"ఓ జనక పుత్రికా! మిథిలానగరమందు, అయోధ్యలోను సుఖముగ పెరిగిన మీకు కఠినమైన అరణ్యమృగముల మధ్య నివాసముండుట కష్టతరము. కావున మీరు దయచేసి ఆ ఆలోచనను విరమించుకొనుము" అన్నాడు రాముడు.

గలగలమని నవ్విన సీత "చెంత మీరుండ వనమందలి మృగములు నన్నేమి చేయగలవు? ఇలాంటి కుంటిసాకులు గనుక వింటుంటే, ఒకవేళ మా తండ్రిగారు పురుషచర్మమును తొడిగిన స్త్రీకి ఇచ్చి నాకు వివాహం జరిపించారో ఏమోయను సందేహము కలుగుచున్నది" అన్నది సీత. ఆమె మాటలు వినిన రాముడు ఇంకేమియూ బదులివ్వలేక ఆమెను కూడా తనతో వనవాసమునకు తీసుకుని వెళ్ళాలని తీర్మానించుకున్నాడు.

పిదప సీతా రామలక్ష్మణులు ముప్పురూ పెదతల్లి కౌసల్య, సుమిత్రలిరువురి వద్దనుండి సెలవు తీసుకుని, మంత్రి సుమంత్రుడు రథమును నడుప అరణ్యమువైపుకు బయలుదేరారు. ఇలా ఆకస్మాత్తుగ మారిపోయిన సంభవమును తట్టుకొనలేని అయోధ్య ప్రజలంతా ఒక సైన్యమువలె ఆ రథము వెనుక వెళ్ళారు.

'గంగయొక్క ఇరు కరములు గలవాడు, గణితం తెలిసిన నోరు గలవాడ'ను ప్రసిద్ధిగల నావికుల నాయకుడైన గుహుడు, రాముని గాంచి సంతసించి, తమ రాజ్యములో పదినాల్గు సంవత్సరములు గడవవచ్చునని కోరగా, కౌసల్యా పుత్రుడాతనిని కౌగిలించుకొని "నీవుకూడా నా సహోదరుడివేకదా" యని బదులిడి, వనమందు పదినాల్గు సంవత్సరములు గడుపుటయే ధర్మమని వివరించాడు. గుహుని సహకారముతో ఆ ముగ్గురూ రాత్రికి రాత్రే జనులకెవరికీ తెలియకుండా నదిని దాటి చిత్రకూటము చేరుకున్నారు.

\- సశేషం

# త్రివిధ తపస్సులు

సేకరణ- యమ్. జానకిరామ శాస్త్రి

శ్రీ మద్భగవద్గీత శ్రీ కృష్ణ పరమాత్ముని దివ్య బోధ అని ఆదరించి ఆర్తిని పోగొట్టి అలమటిస్తున్న దుఃఖితులను ఈ సంసార సాగరం నుండి తన స్వస్థానమైన ఆ భగవానుని చేర్చే నావ, అందరిని తరింపజేసే గానవాహిని, భక్తి అనే బీజంతో, శ్రద్ధ అనే నీటితో, జ్ఞానం అనే ఫలంతో సర్వవేదాంత సారమైన, సకల శాస్త్రాలకు మకుటమైనది గీత అనే ఈ కల్పవృక్షము. ఈ కల్పవృక్షము ఎవరు ఏది కోరితే అది ప్రాప్తింపజేసి చివరకు మోక్షాన్ని సిద్ధింపజేస్తుంది.

గీత యెక్క ముఖ్యోద్దేశ్యము స్వధర్మాచరణ చేస్తూ ఆ పరమ పదము చేరుట. కురు పాండవ యుద్ధం బాహ్యంగా కనిపించినా మనలో ఉన్న దైవశక్తులకు, ఆసురీశక్తులకు నిత్యమూ జరిగే సంఘర్షణే అంతర్యుద్ధమే. ఈ స్థితియందు మానవులకు విచక్షణా జ్ఞానాన్ని ఇచ్చి తరింపజేసేది భగవద్గీత. అందులో అన్ని స్థితులవారికి, అన్ని తరగతుల వారికి కావలసిన భక్తి, ఉపాసన, జ్ఞానాలు ఉన్నాయి. ముందు మానవునిలో ఆ దేవదేవుని యందు భక్తి వుదయించాలి. అది దినదినాభివృద్ధి చెందుతూ ఉపాసన బలం చేత సద్గురు బోధాశ్రవణం వలన, మననము చేస్తూ వుంటే, నిదిధ్యాస కలిగి ఉంటుంది. నిదిధ్యాస అంటే తెలిసిన దాన్ని ఆచరణలో, ధర్మమార్గంలో తన జీవితాన్ని నడుపుకు పోవటం, గడుపుకోవటము. అదే గీతలో 17వ అధ్యాయంలో మూడు తపస్సులను చెబుతుంది.

1. శారీరక తపస్సు 2. వాచిక తపస్సు 3. మానసిక తపస్సు.

1. శారీరక తపస్సు : -

**"దేవ ద్విజ గురు ప్రాజ్ఞ పూజనం శౌచమార్జవం।**

**బ్రహ్మ చర్య మహింసాచ శారీరం తప ఉచ్యతే॥** (17 అ. 14 శ్లో)

తా॥ దేవతలను, బ్రాహ్మణులను, గురువులను, ప్రాజ్ఞులను అన్ని తెలిసిన పండితులను పూజించుట గౌరవించుట, శుభ్రత కలిగి, బ్రహ్మచర్యము, అహింస కలిగి ఉండడము శారీరిక తపస్సు.

భగవంతుని ఆరాధించుట, తల్లితండ్రులను గౌరవించుట, మంత్రోపదేశం చేసిన గురువులను మరవకుండా ఉండుట. పెద్దలను గౌరవించి ఆదరించుట, మనం ఉండే పరిసరాలు శుభ్రంగా వుంచుకుంటూ ఇతర ప్రాణులకు హింస కలిగించకుండా ఉండుట శారీరక తపస్సు అనబడును.

2. వాచక తపస్సు :-

**" అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితం చ యత్ ।**

**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥** (17 అ 15శ్లో)

తా॥ మనం మాట్లాడే మాట ఎదుట వారికి బాధ కలిగించకుండా ఉండాలి. అలా అని అసత్యం చెప్పకూడదు. నిజమే కదా అని కఠినంగా మాట్లాడకూడదు. ప్రియంగా, హితంగా మాట్లాడాలి. ఎప్పుడూ తన్ను తాను చదువుకుంటూ వేదాధ్యయనము చేస్తూ ఉండటము వాక్ తపస్సు.

అసలు ఈ వాక్కుతో చేసే పాపము మాటలే మానవుని అధోగతిని పొందిస్తున్నవి. పరుషమైన మాటలతో ఎదుటవారిని బాధిస్తూ ఉంటారు చాలామంది. అది ఎంతో ప్రమాదాన్ని తెచ్చిపెడుతుంది. ఇది ఒక రాక్షసానందమనే చెప్పాలి. నీ మాటలతో, ప్రేమతో, ఎదుటవారికి మంచి చేయగలిగితే చెయ్యి, లేకపోతే మౌనంగా పక్కకు తప్పుకోవాలి. అంతేగాని ఏదో ఒక మాట అని ఎదుట మనిషి బాధకు కారణమవ్వకుండా వుండటమే వాక్కుతో చేసే తపస్సు. మందస్మితమైన ముఖము చూచే వారికి ఆనందాన్ని కలిగిస్తుంది.

3. మానసిక తపస్సు :-

**మనః ప్రసాద స్సౌమ్యత్వం మౌన మాత్మ వినిగ్రహః ।**

**భావ సంశుద్ధిరి త్యేతత్ తపో మానస ఉచ్యతే ॥** (17అ 16 శ్లో॥)

తా॥ మనసును ప్రశాంతముగా ఉంచుకొని, మౌనమును, సంయమము, హృదయము, శుద్ధిగా ఉంచుకొనుట మానసిక తపస్సు.

ఇదే ప్రతి మానవుడు తెలుసుకోవలసిన సత్యం కూడా. ఎట్టి సుఖదుఃఖములలో కూడా **ఆగమాపాయనో నిత్యః** అని తెలుసుకొని తొట్రుపాటు పడక, వంద మందిలో ఉన్నా, ఒక్కరుగా ఉన్నా, తన మనస్సును అ పరమాత్మయందే, లగ్నం చేసి, నిరంతరము ఆ భగవధ్యానములో వుంటూ, తన ఇంద్రియ నిగ్రహం కలిగి, మనల్ని మనమని గ్రహించుకొని తరించే మార్గం, అఖండమైన భక్తి. "**దాతవ్యమితి యద్దానం**" దానం చేయటమే నా కర్తవ్యం అని దేశకాల పాత్రలను తెలుసుకొని మనల్ని మనమే సంస్కరించు కొని సాత్వికులమై జీవితాలను సుఖమయం, శాంతిమయం, ఆనందమయం, చేసుకొని తరించాలని ఆ గురుదేవుని ప్రార్థిస్తూ.

# పరమ గురువు బాబూజీ మహరాజ్

-కీ.శే తారక పరబ్రహ్మ ప్రసాద్

పరమేశ్వర శక్తి, భగవద్విభూతి అనేక విధాలుగా ప్రకటిత మవుతూ వుంటుంది. అది మహాత్ముల రూపంలో కొంత బయట పడుతుంది. పుణ్యభూమియైన భారతదేశంలో ఉద్భవించిన మహాపురుషుల సంఖ్య లెక్కకు అందనంతగా వుంది. అందులో ఆంధ్రప్రదేశ్‌లో అవతరించినవారే అసంఖ్యాకంగా వున్నట్లు, వారి చరిత్రలు ఊహలకు అందనివిగా వున్నట్లు, వారిలో కొందరి చరిత్రలు గుప్తంగా వుండిపోయినట్లు పరిశోధించినకొద్దీ విశదమవుతోంది.

సుమారు 1933 నుండి 1988 వరకూ జనుల మధ్యలోనే తిరుగుతూ, చాలా కాలం గుప్తంగానే వుండిపోయి, అపర త్రైలింగస్వామి అనదగిన సమర్థ సద్గురు శ్రీహనుమత్ కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి జీవిత చరిత్ర అనేక రకాల వ్యక్తుల జీవితాలను ప్రభావితం చేసి, వారికి పరమ శాంతిని, పరమార్థాన్ని చేకూర్చింది.

1970వ ప్రాంతంలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆంగ్లదినపత్రిక సంపాదకులుగా వున్న శ్రీసంపత్ (తమిళ, వైష్ణవ, బ్రాహ్మణ సదాచార సంపన్నులు) గారు, తరువాత ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకులుగా వుండి, తమకు ఇష్టం లేకపోయినా సంపత్‌గారి బలవంతం మీద శ్రీబాబూజీని దర్శించడానికి వచ్చిన శ్రీ కూచిమంచి సుబ్రహ్మణ్యంగారు పరమ భక్తులుగా మారిపోయి, బాబూజీని గురించి, వారి బోధలను గురించి తమ పత్రికలలో విశేషంగా వ్రాసేవరకు బాబూజీతో సన్నిహితంగా వుండి, అనుభవాలను పొందినవారికి తప్ప అన్యులకు వారిని గురించి ఎక్కువగా తెలియదు.

బాబూజీ ఎక్కువగా ప్రకటనలకు ఇష్టపడేవారు కాదు. వారి వేషభాషలు కూడా వారు మహాత్ములని ఎవరైనా అనుభవజ్ఞులైనవారు చెప్పినా కూడా, వినేవారు నమ్మటానికి వీలుగా వుండేదికాదు. ఏకాంతం లోనుండి బయటకు వచ్చినప్పుడు గొప్ప శ్రీమంతుల వేషం, మాట్లాడితే నంగినంగిగా వుండటం ఎంతటివారినైనా మాయలో పడవేసేవి.

మొదట్లో నమ్మలేకపోయినా, కొంతకాలం పోయాక బాబూజీ గొప్ప మహిమాన్వితులనీ, మహా జ్ఞాని అని తెలుసుకున్న ఒక పెద్దమనిషి బాబూజీతోనే 'స్వామీ! ఇంత గుప్తంగా వుండి ప్రజలను ఎందుకు

మాయలో పడవేస్తారు?' అని అడిగితే, బాబూజీ మాట్లాడుతూ 'ప్రజలను మాయలో పడవేయడం కాదు, మాయలో పడి వున్నవారిలో బయటపడే సమయం వచ్చినవారికే తెలియాలి. అందరికీ తెలిసినా ప్రయోజనం వుండదు. రకరకాలుగా అనుకుంటారు. అవసరమైనప్పుడే, అవసరమైనంత వరకే తెలియనీయాలి. మనం వచ్చిన పనేదో చూసుకోవాలి. చేసి పోవాలి. నీ దగ్గర పదిరూపాయలు వుంటేనే, ఎవరికీ తెలియకుండా పర్సులో దాచుకుంటావు కదా! అర్థాన్ని అంత జాగ్రత్తగా వుంచుకుంటే, బుద్ధిమంతుడైన వాడెవడైనా పరమార్థాన్ని బయటపడ వేసుకుంటాడా? తగినవాడికి, తగినసమయంలో, తగినంతగా తెలుస్తుంది అంతే' అన్నారు.

1940లో విజవాడలో త్రిలింగ విద్యాపీఠ ఆధ్యాత్మిక గురు పరంపరలో ప్రసిద్ధులైన కందర్ప శ్రీరాములుగారి కుమారుడు కందర్ప పరశురామయ్యగారు బాలరామ ఉపాసన చేస్తే, వారికి ఒకనాటి రాత్రి స్వప్నంలో 'రేపు నీకు దర్శనం ఇస్తాను' అని బాలరాముని రూపంలో కనిపించి చెప్పగా, వారికి ఆ మరునాడే బాబూజీ దర్శనం అయింది. అప్పుడు బాబు సుమారు 12సంవత్సరాల వయస్సులో వున్నవారిలాగా కనిపించారు. బాబూజీ ఆధ్యాత్మిక జ్ఞాన సిద్ధులని పరశురామయ్యగారి ద్వారానే క్రమంగా ప్రజలకు తెలియడం మొదలైంది.

1947లో పరశురామయ్యగారు శరీరం విడిచిపెట్టే సమయంలో ఒక్క బాబూజీని తప్ప, తమ భార్యనుగాని, బిడ్డలనుగాని మరెవ్వరిని గానీ తమ చెంతన వుండనీయక, ఆత్మనిష్ఠతో పరమపదం పొందారు.

సుమారు 1945 ప్రాంతంలో ఏలూరు సమీపంలోని గుండుగొలను గ్రామంలో శివాలయం అర్చకులుగా వుండి, ఆయుర్వేద వైద్యంలో అపర ధన్వంతరి అనిపించుకుని, 30 సంవత్సరాలు నిష్ఠతో రాజరాజేశ్వరీ ఉపాసన చేసి, ప్రసిద్ధులైన దేవీ వుపాసకులనెందరినో నెలల తరబడి తమ వద్దనే వుంచుకుని, వారివలన పరమార్థసిద్ధి లభించక, తనకు జగన్మాత దర్శనం కాలేదనే ఆవేదనతో ఆవేశం పొంది 'నీ దర్శనం పొందే యోగ్యత లేని ఈ జన్మ వ్యర్థం' అని తన శిరస్సును ఖండించుకోవడానికి కత్తిని పైకెత్తిన లంక శేషగిరిరావు అనే భక్తునకు వెంటనే అకస్మాత్తుగా బాబూజీ అక్కడ ప్రత్యక్షమై, వెనుక నుండి ఆయన

చేతిని గట్టిగా పట్టుకుని, ఆయనకు జగన్మాత రూపంలో దర్శనమిచ్చి, పరమశాంతిని కలిగించి, ఆయనకు జీవితాంతం తోడునీడగా, పరమగురువుగా వుండి స్థితప్రజ్ఞుని చేసి జన్మసార్థకం చేసిన పరమగురువు శ్రీబాబూజీమహరాజ్!

ఆ రోజుల్లోనే శేషగిరిరావుగారి స్నేహితుడు పోతునూరు గ్రామవాసి, సుప్రసిద్ధ హరికథా కథకుడు, రచయిత అయిన శ్రీ పరిమి సుబ్రహ్మణ్యభాగవతార్ తనపై ఇతరులు చేసిన మంత్ర ప్రయోగం వలన తన గొంతు నుండి మాట రాని స్థితి ఏర్పడి, దానికి ప్రతిక్రియగా ఒక మహా ఉగ్రదేవతను తీవ్రంగా ఉపాసన చేస్తూ వుండగా వారికి శ్రీబాబూజీతో పరిచయం ఏర్పడింది.

బాబూజీ ఇతరులను సర్వనాశనం చేసే శక్తిగల ఆ ఉపాసనను ఆయన చేత మాన్పించి, ఆయన రక్షణ బాధ్యతను తామే వహించి, మరొకసారి అపవాదం జరిగినప్పుడు బాబూజీని స్మరించినంత మాత్రం చేతనే రక్షణ లభించిందని, **స్మర్తగామి** అనే దత్తాత్రేయుని సుప్రసిద్ధ నామం శ్రీబాబూజీకి సార్థకం అయినదని సుబ్రహ్మణ్య భాగవతార్ నాతో స్వయంగా చెప్పారు. ఆయన శ్రీబాబూజీ స్తోత్రాలు, కీర్తనలు, సహస్రనామాలు ఎన్నో రచించి, తన జన్మ సార్థకం చేసుకున్నారు. ఆయన చెప్పిన అనుభవాలు అన్నీ కలిపితే ఒక పెద్ద గ్రంథం అవుతుంది.


**సమర్థ సద్గురు మాసపత్రిక**
**చందావివరములు**

విడి ప్రతి -10రూ,

సంవత్సర చందా -120రూ,

5 సంవత్సరాలకు - 500రూ,

జీవిత చందా (15 సం॥లకు) -1250రూ.

రాజ పోషకులు - 5,116 రూ.

మహారాజ పోషకులు - 11,116 రూ.

# శ్రీ కాళీ వనాశ్రమ శాఖ, భీమవరము, పశ్చిమ గోదావరి జిల్లా (ఆం.ప్ర)

### భవన నిర్మాణము

సమర్థ సద్గురుదేవులు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు లోక కళ్యాణం కొరకై ఎన్నో చోట్లకు వెళ్ళి ఎందరో భక్తుల ఆర్తిని బాపిన అవతార పురుషులు. వారు నడయాడిన ఊరు భీమవరము మరియు ఆ చుట్టు ప్రక్కలనున్న యనమదుర్రు, దిరుసుమర్రు మొదలగు గ్రామములు. శ్రీ స్వామివారు మహా ప్రస్థానం పొంది 35 సంవత్సరములు అయినవి. ఇచ్చటి భక్తులందరూ చేరి భీమవరం-విజయవాడ (ఉండి) రోడ్డున దాతలు ఇచ్చిన స్థలములో బృందావనము, దాని ప్రక్కన అన్నదాన శాల, వసతి గృహము నిర్మింప సంకల్పించినారు. ఈ భవన శంకుస్థాపన శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతి యోగిని శ్రీచంద్ర కాళీ ప్రసాద మాతాజీవారు, ది.10-05-2023 తెల్లవారు జామున 3.24 గం.లకు చేశారు.

ఈ సందర్భమున భక్తులకు చేయు విన్నపమేమనగా, మీరెల్లరూ ఉదార స్వభావముతో ముందుకు వచ్చి త్వరలో ఈ భవన నిర్మాణము పూర్తియగునట్లు తమ సహాయ సహకారములను ధన రూపేణ, వస్తు రూపేణ అందించమని ప్రార్థించుచున్నాము.
విరాళములు ఈ క్రింది బ్యాంక్‌కు పంపవలెను.

Sri Sri Sri Hanumat Kali Vara Prasad Babu Trust
Bank of Baroda, Nambur Branch
S/B Account No : 69900 1000 00 172
IFSC : BARB0DBUNAM (5th character is 'zero')
Contact Numbers
Murali : 93983 34345
Tummalapalli Siva : 96181 99556

భక్తులు ఒసగు విరాళములకు ఐ.టి యాక్ట్ 80జి క్రింద పన్ను రాయితీ లభించును.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ మాపులేటి ఈశ్వరరాజుగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

ప్రమాదం జరుగుతుందేమోనని డాక్టరుగారికి భయంగా వున్నా, శ్రీబాబు మాటను కాదనలేక పోయారు.



ఈశ్వరరాజుగారు వచ్చి, విషయం తెలుసుకుని "శ్రీ బాబు చెప్పినట్లే మనం నడుచుకోవాలి. మీరు ఆపరేషన్ ప్రయత్నం విరమించుకొని, నొప్పికి ఏదైనా యింజెక్షనో, మందులో యివ్వండి. వారి అనుగ్రహం వలన తప్పక తగ్గుతుంది. నేను శ్రీ బాబు దర్శనం చేసుకుని వారితో మాట్లాడి వస్తా"నని వెళ్ళిపోయారు.

కాని ఏలూరులో ఉన్న భక్తులందరి యిళ్ళలో విచారించినా శ్రీ బాబు వచ్చిన జాడ తెలియలేదు. తిరిగి ఆసుపత్రికి వచ్చేసరికి మధు కులాసాగా ఉన్నాడు. ఈశ్వరరాజుగారు శ్రీ బాబు జాడ తెలుసుకోవాలనే తపనతో గుంటూరు మాజేటి పున్నయ్యగారింటికి ఫోన్ చేశారు. శ్రీ బాబు రెండు రోజుల నుండి గుంటూరు వదిలి ఎక్కడికీ వెళ్ళలేదని తెలిసింది. సద్గురు దేవులు తమ ఆశ్రితులను నీడలా వెన్నంటి ఎలా కాపాడుకుంటారో తెలిసిన యీశ్వరరాజు గారు, సుశీలమ్మగారు ఆనంద బాష్పాలతో శ్రీ బాబును తమ మనో మందిరంలోనే అభిషేకించుకున్నారు.

1966లో ఉత్తర దేశ యాత్రలకు భక్తులందరిని తీసుకుని వెడుతూ శ్రీ బాబు యీశ్వరరాజు దంపతులను రమ్మన్నారు. ఈశ్వరరాజుగారు పనుల వత్తిడి వలన తాము రాలేమని, సుశీలమ్మగారిని పంపటానికి సమ్మతించారు.

ప్రయాణమునకు సిద్ధమై బెజవాడ స్టేషన్‌కు చేరుకున్న తరువాత యీశ్వరరాజుగారు శ్రీ బాబు వద్దకు సుశీలమ్మ గారిని తీసుకుని వచ్చి శ్రీ బాబు చేతిలో ఆమె చేతినుంచి "యాత్రలో యీమె సంరక్షణ భారం మీ చేతుల్లో ఉంచుతున్నాను బాబూ! అసలే భయస్తురాలు" అన్నారు. శ్రీ బాబు పకపకా నవ్వుతూ, ప్రక్కన ఉన్న తారకంగారితో "ఏమిటయ్యా తారకం? మీ 'ఫ్రెండ్' ఏమిటో అంటున్నాడే? యాత్రలో ఆమె సంరక్షణ భారం అంతా ఆయనే చూసుకుంటున్నాడన్న మాటే గదా! అవును మరి! తన రక్షణను తన కుటుంబ రక్షణను ఆయన చూసుకోకపోతే మరెవరు చూసుకుంటారు?" అన్నారు. ఈశ్వరరాజు గారు సర్దుకొని "క్షమించండి బాబూ! మా సర్వ భారమూ వహిస్తున్నది తమరే" అన్నారు.

అలాగే యాత్ర ముగిసిన తరువాత యాత్ర బండి బెజవాడ చేరినప్పుడు, ఫ్లాట్‌ఫారం మీద వేచి ఉన్న ఈశ్వరరాజుగారి వద్దకు శ్రీ బాబు సుశీలమ్మగారిని తీసుకుని వెళ్ళి, ఆమె చేతిని ఈశ్వరరాజుగారి చేతిలో ఉంచుతూ "ఇదిగో రాజుగారూ! మీ ధర్మపత్నిని మీకు భద్రంగా అప్పచెబుతున్నాను" అన్నారు.

శ్రీ బాబుతో ఈశ్వరరాజు దంపతులు శ్రీశైల యాత్రకు వెళ్ళారు. ఒక రోజున ఈశ్వరరాజుగారు శ్రీ బాబుతో వచ్చిన భక్తుల కోసం పులిహోర తయారు చేయించి, మల్లికార్జున స్వామి వారి ఆలయంలో నైవేద్యం పెట్టించి సత్రానికి తీసుకుని వచ్చారు. ఆయన శ్రీ బాబుతో "తమ అనుమతితో యీ ప్రసాదమును భక్తులకు వినియోగ పరుస్తాను బాబూ!" అన్నారు. శ్రీ బాబు "చాలా సంతోషం. శ్రీ మల్లికార్జున స్వామికి నివేదన చేసిన యీ మహాప్రసాదమును నీవు గుడి దగ్గర నిలబడి, వచ్చిన ప్రతి భక్తునికి పెట్టు. నీకు ఎంతో పుణ్యం వస్తుంది" అన్నారు.

- సశేషం

## విన్న  కథలు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

# సమర్థ రామదాసు

"సద్గురు పరిపూర్ణుడు! ఆయన ఎదుట పడేసరికే భేదం హరిస్తుంది. దేహం లేకుండా దేహరాహిత్యంగా వారికి నమస్కరించాలి! అట్టి ప్రభువు సన్నిధి దుర్లభం! ఇది దాస్ బోధలో 7వ దశకంలో మొదటి సమాసంలో 18వ శ్లోకం" అని వినయంగా చెప్పాడు కళ్యాణ్. "ఒరేయ్! దాస్‌బోధ చూడండిరా! వీడేదో కోతలు కోస్తున్నాడు" అంటూ తను కూడా దాస్ బోధ అందుకుని చూశారు. కళ్యాణ్ చెప్పింది సరిగ్గానే ఉంది. ఇది యాదృచ్ఛికం అంటూ "ఒక దేశ కాలమునకు పరిమితమయినదా...." అన్న శ్లోకం తర్వాతది ఏది? అన్నారు.

కళ్యాణ్ తడుముకోకుండా చెప్పాడు. "కళ్యాణ్ ఇంత సరిగ్గా పొల్లు పోకుండా చెప్తున్నావు. ఎన్నిసార్లు పారాయణ చేశావేమిటి? అన్నారు. "నాకు పారాయణ చేసే తీరిక ఎక్కడిది? ఎప్పుడో మీరు చెప్పినప్పుడు వ్రాసినదే" అన్నాడు కళ్యాణ్. సమర్థులు శిష్యులతో "కళ్యాణ్ పప్పు, బెల్లం, నెయ్యితో చేసిన పూర్ణమే కాదు, పరమార్థ పూర్ణాన్ని సహితం జీర్ణించుకున్న సమర్థుడు. వాడిని ఎవరైనా 'పప్పు సుద్దయ్య' అన్నారంటే మర్యాద దక్కదు" అని హెచ్చరిక చేశారు.

కోట పైన అతనికి బరువు బాధ్యతలు అప్పజెప్పారు. ఒకసారి ఛాఫళ్‌లో రామనవమి ఉత్సవాలు జరుగుతున్నాయి. రాములవారిని ఏనుగుపై అలంకరించాలని సమర్థులు సంకల్పించారు. రాముని ఏనుగుపై అలంకరించే సమయంలో అది ఘీంకరించి స్వైర విహారంగా పరిగెడుతున్న ఏనుగను మావటివాడు కూడా అదుపులో పెట్టలేక పోతున్నాడు. సమర్థులు కేకవేసి "చూస్తావేం కళ్యాణ్! ఆ ఏనుగను అదుపులో పెట్టు" అన్నారు. "ఆజ్ఞ గురుదేవా!" అని జబ్బలు చరిచి దానిపై దాడి చేశాడు. ప్రప్రథమంగా దాని తొండాన్ని ఒడిసి పట్టుకుని దాని రెండు కోఱలు పీకాడు. దానితో రెచ్చిపోయిన ఏనుగ కళ్యాణ్‌ని పట్టుకొని

విసిరెయ్యాలని చూసింది. దానికి వెరవక దాని కుంభస్థలాన్ని నాలుగుసార్లు పిడికెళ్ళతో గుద్దాడు. ఏనుగ నేలకూలింది. కళ్యాణ్ బాగా అలిసిపోయి గురుదేవులకు ప్రణామంచేశాడు. "కళ్యాణ్‌కి ఏనుగును చిత్తు చేసే బలం ఎలా వచ్చిందంటారా! దానికి కారణం అతను గురు ఆజ్ఞను తు.చ. తప్పక పాటించడమే. మరియు అతడు అస్ఖలిత బ్రహ్మచారి" అన్నారు సమర్థులు.

ఒకసారి సమర్థులు సంచారంలో ఉండగా ఒక దంపతులను కలిశారు. వారు తమ ఏడేళ్ళ కొడుకును సమర్థులకు అర్పించారు. అతని పేరు మధుకర్. అతడిని తనతో సంచారానికి తీసుకువెళ్ళారు. వారు ఒక పల్లెటూరు చేరారు. ఊరి చివర ఉన్న హనుమంతుని గుడిలో బసచేశారు. "ఒరే మధుకర్! నువ్వు వెళ్ళి మధుకరి తీసుకురా!" అని ఆదేశించారు. అతను మధుకరికి వెళ్ళగా "నువ్వు కొత్తగా వచ్చావా? మా అందరి భోజనాలు అయిపోయాయి. ఇప్పుడు నీకు ఎవరేస్తారు మధుకరి?" అన్నారు ఆ గ్రామవాసులు. "జోషి బువా అందరికన్నా ఆలశ్యంగా భోంచేస్తాడు. గొప్ప ధనికుడు, ఉదారబుద్ధి కలవాడు, జ్యోతిష్యశాస్త్రంలో ఆరితేరినవారు. అక్కడికి వెళ్ళండి, అక్కడ దొరుకుతుంది మధుకరి" అని చెప్పాడు ఆ ఊరివాడు ఒకడు.

మధుకర్ ఆ ఇంటి ముందు నిలబడి

***సమర్థాచియా సేవక వక్రపాహె। అసా సర్వ భూమండలికోణ ఆహె।***

***జయాచి లీలా వర్ణితి తీన్హిలోకి। సుపేక్షీ కదా రామదాసాభిమాని।***

అని దాస్‌బోధ పంక్తులు చదివాడు. తర్వాత "జయజయ రఘువీర సమర్థ!" అని గర్జించాడు. ఆ గర్జనకు జోషి బువా బయటకి వచ్చారు. "నువ్వు చెప్పిన శ్లోకానికి అర్థం చెప్పు" అన్నారు జోషి.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

# శ్రీ మాతాజీ వారి అమెరికా పర్యటన దృశ్యములు



దల్లాస్‌లో శ్రీ శ్రవణ్‌కుమార్, రమారేఖ గారి గృహమున



ఆస్టిన్‌లో శ్రీ సతీష్, రాజీ గారి గృహమున



ఆస్టిన్‌లో శ్రీ రంజిత్‌కుమార్, లక్ష్మీరేఖ గారి గృహమున



దల్లాస్‌లో శ్రీమతి డా. రాణి గారి గృహమున

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No.: 37804/1981
Postal Regd. No. : GTR/27/2021-2023

## శ్రీ మాతాజీ వారి అమెరికా పర్యటన దృశ్యములు



డల్లాస్‌లో
శ్రీమతి వత్సలగబ్బార్ గారి
గృహమున



డల్లాస్‌లో
శ్రీ మావులేటి కృష్ణప్రసాద్ గారి
గృహమున



టేలర్‌లో
డా. శివ గారి
గృహమున

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.